జనంతో..మమేకమై..

ప్రజాక్షేత్రంలో గులాబీ దూకుడు

ప్రజల్లోకి దూసుకెళ్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

- నేతలతో సమన్వయం.. నిత్యం ప్రజలతో మమేకం
- బీఆర్ఎస్‌కు జై కొడుతున్న సబ్బండ వర్గాలు

ప్రజాక్షేత్రంలోకి బీఆర్ఎస్ పార్టీ దూసుకెళ్తున్నది. ఎన్నికల ప్రచారంలో జోరు పెంచింది. బీఆర్ఎస్ కంటోన్మెంట్ అభ్యర్థి నివేదిత ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. నేతలను సమన్వయం చేసుకుంటూనే, నిత్యం పార్టీ శ్రేణులు, ప్రజలతో మమేకమవుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని వార్డుల సన్నాహక సమావేశాలను విజయవంతంగా నిర్వహిస్తూనే మరోవైపు కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను ఎండగడుతున్నారు. – కంటోన్మెంట్



ఇంటింటి ప్రచారంలో భాగంగా ఓట్లను అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత

ప్రతినిత్యం ప్రజల కోసమే..

కంటోన్మెంట్ ఉప ఎన్నికలకు ఇప్పటికే నామినేషన్ల ఘట్టం నడుస్తుంది. దీంతో కంటోన్మెంట్‌లో ఎన్నికల వేడి రాజుకుంది. దివంగత ఎమ్మెల్యే సాయన్న వారసురాలిగా ఇప్పటికే జనాల్లో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత దూకుడుగా ప్రజల్లోకి వెళ్తున్నారు. అన్ని వర్గాలను కలుస్తూ మద్దతు కూడగడుతున్నారు. జోరుగా ప్రచారం చేస్తున్నారు. టికెట్ ఖరారైనప్పటి నుంచి జన మధ్యలోనే ఉంటున్నారు. బీఆర్ఎస్‌లోని ముఖ్య నేతలను అందరినీ ఇప్పటికే కలిసి సమన్వయం చేసుకుంటున్నారు. కేడర్‌కు సైతం నిత్యం అందుబాటులో ఉంటున్నారు. మేధావులను కలిసి సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డిల నేతృత్వంలో ప్రత్యర్థులకు అంతుపట్టకుండా గెలుపు కోసం అంతర్గతంగా వ్యూహాలకు పదును పెడుతున్నారు.

అభ్యర్థికి అండగా నిలుస్తున్న రావుల, మర్రి

బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితకు అన్ని వర్గాల నుంచి మద్దతు పెరుగుతున్నది. కంటోన్మెంట్‌లో గెలుపే ధ్యేయంగా అభ్యర్థి నివేదితకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డిలు అండగా నిలుస్తున్నారు. ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తూ ప్రచార వ్యూహాలను పక్కా ప్రణాళికతో ముందుకు తీసుకెళ్తున్నారు. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత చురుగ్గా వ్యవహరిస్తుండటంతో గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.

వృద్ధురాలి ఆశీర్వాదం తీసుకుంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

కాంగ్రెస్ వైఫల్యాలపై ఫోకస్

ఎన్నికల కోసం సన్నాహక సమావేశాల్లో పార్టీ శ్రేణులను సంసిద్ధులను చేస్తున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టడం, ప్రభుత్వంలోకి వచ్చాక హామీలు అమలు చేయకపోవడంపై శ్రేణులను చైతన్యం చేస్తున్నారు. గతంలో రేవంత్‌రెడ్డి, ప్రియాంకగాంధీ, భట్టి విక్రమార్క ఇచ్చిన హామీలను ఎండగడుతున్నారు. బీఆర్ఎస్‌ను ఎందుకు గెలిపించాలి..? కాంగ్రెస్ గెలిస్తే కలిగే నష్టాలను వివరిస్తున్నారు. అంతేకాకుండా పదేండ్లలో కంటోన్మెంట్‌కు బీజేపీ చేసిన మేలు ఏం లేదని, గెలిచిపించినా ఏం చేయబోరని స్పష్టం చేస్తున్నారు.

కంటోన్మెంట్‌లో జక్కుల మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత

వర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



సివిల్స్ విజేతలను సన్మానిస్తున్న ప్రొఫెసర్ రవీందర్, డాక్టర్ కొండా నాగేశ్వర్

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 22: ఇటీవల విడుదలైన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను వీసీ ప్రొఫెసర్ రవీందర్ సోమవారం సన్మానించారు. సివిల్స్‌లో 82వ ర్యాంకు సాధించిన కౌశిక్, 545వ ర్యాంకు సాధించిన నరేంద్ర, సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండ నాగేశ్వర్‌తో కలిసి వీసీతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఓయూ విద్యార్థులు సివిల్స్‌లో విజయం సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఉత్తమమైన లక్ష్యం కోసం సివిల్స్ సాధించిన వారు తప్పనిసరిగా సామాజిక అభివృద్ధిలో, ప్రత్యేకించి ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

నాలుగోరోజు తొమ్మిది
నామినేషన్ల దాఖలు

కంటోన్మెంట్, ఏప్రిల్ 22: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికకు సంబంధించి బోర్డు కార్యాలయంలో సోమవారం మొత్తం తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ తెలిపారు. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నివేదిత తరపున గోపాల్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ గణేష్ నారాయణ్ నామినేషన్ దాఖలు చేశారు. అదే విధంగా భారతీయ జనతాపార్టీ తరపున ఎంఎ శ్రీనివాస్ రెండు సెట్‌ల నామపత్రాలు, బహుజన్ ముక్తి పార్టీ తరపున రాజేందర్, స్వతంత్ర అభ్యర్థులుగా జీడిమడ్ల రాజ్‌కుమార్, సంజీవులు, బండారు నాగరాజు, రేకల సైదులు, దండెం రత్నం నామపత్రాలు దాఖలు చేసినట్లు సీఈఓ మధుకర్‌నాయక్ తెలిపారు.

బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 22 : భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు తెలంగాణ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో పాసయ్యారు. వారిని సోమవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కే.మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ 20 మంది ప్రవేశ పరీక్షకు హాజరు కాగా, 13 మందికి సీట్లు వచ్చాయని అన్నారు. ఇప్పటివరకు తమ పాఠశాల నుండి సుమారు 70 మందికి పైగా విద్యార్థులు వివిధ గురుకుల పాఠశాలల్లో చదువుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మేరి, మహాలక్ష్మి, పరశురామ్, ఉన్నత పాఠశాల సాధన కమిటీ కో–కన్వీనర్లు బి.నర్సింగ్‌రావు, విజే.శేషగిరి రావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డాక్టర్ రాజారావు ప్రోత్సాహం

గురుకుల పాఠశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులకు అవసరమైన మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు వెంటనే జారీ చేశారు. అనంతరం గురుకులంలో సీట్లు పొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా కొంత మంది విద్యార్థులకు సాయం చేశారు.

'గ్రాడ్యుయేషన్ డే' : భోలక్‌పూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సోమవారం 'గ్రాడ్యుయేషన్ డే' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాస్, కేటీఎస్ జోనల్ ఇన్‌చార్జి బుచ్చిరెడ్డి సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేసి, అభినందనలు తెలిపారు. – బన్సీలాల్‌పేట్

రాంగోపాల్‌పేట్‌లో
కిషన్‌రెడ్డి పాదయాత్ర

బేగంపేట్, ఏప్రిల్ 22: సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి జి కిషన్‌రెడ్డి సోమవారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో ర్యాలీతో పాదయాత్ర నిర్వహించారు.సింధి కాలనీ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర బాబుబాగ్ కాలనీ, కృష్ణానగర్, వెంకట్రావ్‌నగర్, జవహర్‌నగర్, డీవీ కాలనీ, రాంగోపాల్‌పేట్, మార్కెట్, పాన్‌బజార్, నల్లగుట్ట, మహంకాళి దేవాలయం వరకు కొనసాగింది. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ...బీజేపీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

'హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయండి'

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 22: ఈ నెల 23న నిర్వహించే హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని పలువురు అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. హనుమాన్ శోభాయాత్రను పురస్కరించుకొని లాలాపేట మున్సిపల్ స్టేడియంలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శ్రీరామనవమి అనంతరం వచ్చే హనుమాన్ శోభాయాత్రను ఈ ఏడాది ఘనంగా నిర్వహించాలని స్థానికులకు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు లాలాపేట ఇసుకబావి నుంచి ప్రారంభమయ్యే బైక్ ర్యాలీ తాడ్‌బండ్ ఆంజనేయస్వామి దేవాలయం వరకు కొనసాగుతుందని చెప్పారు.



దిశానిర్దేశం

బౌద్ధనగర్ డివిజన్ పార్సిగుట్టలోని రాఘవ గార్డెన్‌లో సోమవారం సికింద్రాబాద్‌కు చెందిన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అదేవిధంగా కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశానికి ముందు కళాకారులు తమ ఆటా పాటలతో కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

పలు పార్టీలో చేరికలు

బీజేపీలోకి: మారేడ్‌పల్లి ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, ఇందిరమ్మ కమిటీ మాజీ చైర్మన్ ఉమేష్ యాదవ్‌ను మహేంద్రాహిల్స్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయ ఆవరణలో మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే. రామకృష్ణ, నాయకులు భానుక మల్లికార్జున్, బీఎన్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. – మారేడ్‌పల్లి

కాంగ్రెస్‌లోకి: మారేడ్‌పల్లి శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ చైర్మన్, సీనియర్ నాయకుడు చిర్రబోయిన సంతోష్ యాదవ్ కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ చైర్మన్ మైనంపల్లి హన్మంతరావు లు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సంతోష్ యాదవ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్రినాథ్ యాదవ్, ముప్పిడి గోపాల్, దేవేందర్, జంపన ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. – మారేడ్‌పల్లి

ప్రజా వ్యతిరేక విధానాలపై అవగాహన

మౌలాలిలో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు తథ్యమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం మౌలాలి, భరత్‌నగర్, వినాయక్‌నగర్, ఆనంద్‌బాగ్ నుంచి మల్కాజిగిరి చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు తప్పుడు వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేసిందని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలని నమ్మించి.. గద్దెనెక్కిన తర్వాత వాటిని మరిచిందని ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజక వర్గంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించిందని అన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తామని అన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలపైన ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.

మహిళల సమ్మేళనం: సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో సోమవారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళల సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి మల్లారెడ్డి, మాల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి,కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత తదితరులు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ. నాలుగు వేల పెన్షన్ ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదని మండిపడ్డారు.కేంద్రంలో కాంగ్రెస్ గెలుస్తేనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి అనడం విడూరంగా ఉందని విమర్శించారు.

లోప్రెషర్
పరిష్కారానికి కృషి

అంబర్‌పేట, ఏప్రిల్ 22: అంబర్‌పేట డివిజన్ రఘునాథ్‌నగర్‌లో కొన్నిరోజులుగా తాగునీరు లోప్రెషర్‌తో వస్తున్న విషయాన్ని తెలుసుకున్న కార్పొరేటర్ ఈ.విజయ్‌కుమార్‌గౌడ్ సోమవారం బస్తీలో పర్యటించి స్థానికులను అడిగి పరిస్థితిని పరిశీలించారు. సంబంధిత వాటర్‌వర్క్స్ అధికారులతో మాట్లాడి.. వేసవిని దృష్టిలో పెట్టుకొని వీలైనంత త్వరగా నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నాన్ మైనార్టీ అడ్మిషన్‌లు పూర్తి

మల్కాజిగిరి, ఏప్రిల్ 22: బాలికల మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో నాన్ మైనారిటీ విద్యార్థుల అడ్మిషన్‌లను పారదర్శకంగా పూర్తి చేశామని ప్రిన్సిపాల్ మాధవి రెడ్డి తెలిపారు. సోమవారం మౌలాలిలోని బాలికల మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో హైదరాబాద్ జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మహ్మద్ ఇలియాస్ అహ్మద్‌తో పా టు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడీప్ ద్వారా ఇరవై సీట్ల లో బీసీలు 10, ఎస్సీలు 5, ఎస్టీలు 3, ఓసీలు 2 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ .. బాలికల స్కూల్‌లో ఐదో తరగతి చదువుకోవడానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల అడ్మిషన్‌లను సోమవా రం తల్లిదండ్రుల సమక్షంలో పూర్తి చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి విజయకుమార్, అడ్మిషన్ కమిటీ సభ్యులు సరిత, రాజేశ్వరి, వీణ పాల్గొన్నారు.

'విజయలక్ష్మి వేంకటేశ శతకం' పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, ఏప్రిల్ 22 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ కవుల సంఘం – కళాసూర్య కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కవి ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జనువాడ రామస్వామి రచించిన 'విజయలక్ష్మి వేంకటేశ శతకం' పుస్తకావిష్కరణ సోమవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు.

కార్యక్రమానికి వక్తలుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్సలర్, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, కవి పండితులు సుధామ, విహరి, గిరిజామనోహర్‌బాబు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా.మామిడి హరికృష్ణ, కొలకలూరి ఇనాక్

PUBLIC CAUTION NOTICE

The General Public is hereby informed that my client Neelam Satya Prakash S/o Late Siddaraman, Age: 51 Years, Occu: Business, R/o H.No.12-1-4/25/2RT, LIGH, Near Pochamma Temple, Lalapet, Marredpally Secunderabad, T.S. has lost his bag in the Auto after attending advocate office at Himayathnagar for legal opinion for obtaining loan in bank. After completion of his work he returned back to go to his house in the auto and reached his house and get down Auto and entered his house by leaving his bag in the auto. The said containing his original document bearing No.94/1991, dated 12.07.1991. In this regard my client given Police complaint on 13.04.2024.

In this regard, the General Public is hereby requested to hand over the same to my client, if it is found by any one at any place to the below mentioned address.

NANCHARLA MURALI, ADVOCATE
Flat No.104/110, H. No: 3-6-440, Sri Ganesh Apartments, Street No. 5, Himayathnagar, Hyderabad- 500029,
Mobile No:9989045597
Hyderabad, Date: 22-04-2024